


చక్కని వాతావరణంలో అందమైన ముద్దు లొలికే భవంతి. రమ్యమైన తోట దానిచుట్టు!

ఒక్కగా నొక్క, లేకలేక కల్గిన గారాబు బిడ్డ సాధన. చదువుల పుట్ట, అందాలగని! అహం, గర్వం హెచ్చు పాళ్ళలో కల్గిన మిశ్రమం! ఆమె "ఊ" అంటే పది మంది చేతులు కట్టుకొని తిరుగుతారు. కోటికి పడగలెత్తిన రమాదేవ్ కూతురు! ఆమెకు లోపమేముంటుంది?

సాయింత్రం అయిద్దైంది. టెన్నిస్ ఆడుతుంది సాధన తన నేస్తం జయంతితో, ఆటపాకంలో పడేటప్పటికి చినుకులు ప్రారంభమైనాయి! పట్టుదలతో ఆడుతున్న వారిద్దరు చినుకులను లెక్క చేయలేదు. మీదు మిక్కిలి ఆవాన వారి నాహ్లాదాన్ని కల్గించింది.

"గేమ్!" అని అర్చింది సాధన బంతిని సాధ్యమైనంత కోణంలో, జయంతికి ఎత్త శక్యంకాని తీరులో శక్తి కొలది విసురుగా కొట్టి. "కన్గ్రాచులేషన్సు!" అన్నది జయంతి కరచాలనం చేస్తూ, సాధన దరికిచేరి. చలన రహితంగా పోర్టికోలోనిల్చి వున్న యువకుని సర్గ్గా అదే నిమిషంలో వారిద్దరు చూచారు.

సూటిగా సాధన కొట్టిన బంతి అతని గుండెకు తగిలి ఒక ఎఱ్ఱమట్టి ముద్రను అతని తెల్ల దుస్తుల మీద వేసి క్రింద పడింది. ఎఱ్ఱని గోళాకారంలో బంతి చేసినపని కూడా వారిద్దరికి స్పష్టంగా కన్పించింది.

సాధన కొంచెం చలించింది. అపరిచితుడైన ఒక వ్యక్తికి ఆబంతి తగిలి అతని గుడ్డలను మలిన పర్చటం, ఎంత నిర్లక్ష్యంగా తిర్గేవారికైనా ఒక్క నిమిషకాలం స్తంభీభూతులుగా చేయక పోదు. అతని వైపునడ్చింది. ఆమె పెదవులనుంచి ఏదో ఒక మాటజారబోయింది. కాని అతను వినిపించుకోకుండానే అతి మౌనంగా వెళ్ళిపోయాడు. ఆమె మధుర స్వరపు పలుకులు పలుకలేదు-పెదిమలు కదిలినా కూడా. జయంతి సాధన భుజం మీద చేయివేసింది. జయంతి ముఖంలోకి చూచింది సాధన.

రచన: శ్రీ సాయిశ్రీ

"ఊఁ! ఎంత నిర్లక్ష్యం! ఏమి చూచి ఆ బిగువు?" అన్నది సాధన. చకితురాలైంది జయంతి.

అతను వానులో ఎక్కిపోతున్నాడు వ్యానుచుట్టు కట్టిన గుడ్డలమీద అక్షరాలున్నాయి! సారాంశం......"వరద బాధితులకు సహాయం చేయండి!"

"సాధన్! ఏదో చందా కోసం వచ్చాడేమో! అన్నది జయంతి తన ప్రశ్నకు తానే సమాధానం చెప్పుకునే తీరులో.

"ఆడుకొట్టానికి వచ్చిన వాడికి ఇంత గర్వమా?" అన్నది సాధన కళ్ళు చింతనిప్పుల్లా గున్నాయి.

"అతనేంగర్వం పడ్డాడు. బంతి అతనికి తగిలింది. డాగు అయింది. ఏమనకుండానే వెళ్ళిపోయాడు. ఇందులో గర్వమే ముంది? ఊఁ!..." అనుకుంది మనసులో జయంతి.

"నా అంతటిది దరికి వచ్చి కన్నెత్తి చూడటమే గొప్ప! నేను "సారీ" అని అందామనుకున్నా. గర్వం కాకపోతే నా మాట వినకుండానే పోవటం దేనికి?' అన్నది సాధన జయంతి మనస్సులోని ప్రశ్నకు సమాధానం లాగ.

బహుశ భావతరంగాలు ఎదుటి వ్యక్తిమీద తమ ప్రభావం చూపిస్తాయేమో! "స్త్రీకి ఇంత అహం పనికి రాదు" అనుకుంది జయంతి మనస్సులో. పైకి అనలేక కొన్నినిమిషాలు వ్యర్థంగానే గడిచాయి!

"అతనెవరో తెల్సా సాధన్?"

ఎవరన్నట్లు చూచింది సాధన్ జయంతి ముఖంలోకి,

"శ్రీ కాంత్ యం. ఏ. మంచిగుణవంతుడు, ఎక్కడ ఏ అవసరం వచ్చినా ముందుకు దూకి, అదుకునే సంఘ సేవా పరాయణుడు. ఇంత చిన్న వయస్సులోనే ఎంతోపేరు సంపాదించు

కున్నవాడు. ఆయను అదుకొక్కతినే రకం అనటం......"

"నీకుబాధగా వుందా? అయన గొప్ప నాకేమిటి? సంఘసేవ పేరుచెప్పి పొట్టపోసుకొనే వాళ్ళెంత మంది వున్నారో? అందులో ఇత నొకడు అంతే..." అంటూ అతను పోయినవైపే కొంతసేపు చూస్తూ అన్నది సాధన. ఎందుకో ఆ చూపు.

"కాని ముత్యాలు, నత్తగుల్లలు పుట్టే చోటు ఒకటే. కాని వాటిలో వ్యత్యాసాలున్నాయి! అంత మంచి వాడు నేను విన్నంత వరకు ఎవరులేరు ఇది నా భావన!"

"తెలుస్తునే వుంది ఎంత మంచి వాడో!" అన్నది సాధన వెక్కిరింపుగా! కాని అమె మనస్సులో ఏదో కదలుతుంది. అది ఇదమిద్ధ మని తెల్సుకోలేక పోయింది సాధన. దానికి కారణం అహం!

★ ★ ★

"ఏమ్మా! నీమనస్సు కోరిన వ్యక్తి ఎవరైనా వుంటే చెప్పు. ఎన్ని సంబంధాలు తెచ్చినా నీకు నచ్చవయ్యే"! అన్నాడు రమాదేవ్ విసిగివేసారి.

"దాదీ! ఇప్పుడేం అవసరం?" అన్నది సిగ్గు పడకుండా. సిగ్గు పడటం ఇప్పుడు పురుష లక్షణంగా!

"ఇంకా ఎన్నిరోజులమ్మా? నీకు ఇరవై ఏళ్ళొచ్చె! నిన్ను కని, పురిటిలోనె మీ తల్లిపోయే! నాకు యాభై దాటే! ఎన్ని బాధ్యతలు! ఎన్నిబాధలు ఇవన్ని ఇంత నేను మోయలేను. నీవే నాకు తురివికొడుకువు. నీకు పెళ్ళి చేసి, మీ ఇద్దరికి బాధ్యతలు ఒప్పగించిన తరువాత నేను కన్ను మూసినా ఫరవా లేదు......"

"ఏంమాటలు దాదీ! మీ యిష్టం" "ఇచ్చాడూ! రాజశేఖర్ కుటుంబం లాంటిది ఈచుట్టు ప్రక్కలకనుపించదు. వెయ్యి ఎకరాల మాగాణీ! లెక్కలేనంత మిట్టపొలం, సాటిలేని సంపద! వందలకొలది పాలేర్లువున్నారు. రాజశేఖర్ ముందు ఎవరైన తీసికట్టే అందంలో ఫారిన్ రిటరన్డ్! డబుల్ పి. హెచ్. డి. అతనికి సాటి అతనే! ఇంతకన్నా మంచి సంబంధంలేదు. అతనికోసం ఎందరో తిర్గు తున్నారు... కట్నాలంటే అతనికి గిట్టవట కూడా."

ఓ. కే! దాదీకి నచ్చితే నాకునచ్చినట్లే! అన్నది సాధన తన అదృష్టానికి పొంగిపోతూ. తస కాబోయే భర్త అందం, చదువు ధనాలమూట! ఇంకేం కావాలి స్త్రీకి? అవి సాధన కోరుకున్న అంశాలు. తనకు కాబోయే పురుషునకు అద్దంలో తన ప్రతి బింబాన్ని చూచుకొని మురిసి పోయింది. రమాదేవ్ శాంతి యుతమైన మనస్సుతో బయటికి నడిచాడు.

సాధన అక్కడే వున్న రాజశేఖర్ ఛాయాచిత్రం చూచి మురిసిపోయింది. తన హృదయంలో దాచుకుందా మనుకుంది

* * *

నూలును బట్టి బట్ట అంటారు. తన ఏకైక పుత్రిక కల్యాణానికి బ్రహ్మాండమైన సంబారం తయారు చేయించాడు రమాదేవ్. భూలోక స్వర్గంలాగ "లాల్ బాగ్" వెలిగిపోతుంది. ఆరోజు ఎక్కడ చూచిన రమాదేవ్ హడావిడిగా తిరుగుతున్నాడు.

పెండ్లి మంత్రాలు చదువుతూ తంతు జరిపిస్తున్నాడు పురోహితుడు.

పెండ్లి కొడుకు తండ్రి గుణేంద్రుడు రమాదేవ్ వైపునడిచాడు. ఆయన ఆనందమగ్న డైవున్నాడు కూతుర్ని పెండ్లి దుస్తుల్లో చూస్తూ.

"రమాదేవ్‌గారూ......మరి ఆ విషయం..." అని నాన్చాడు గుణేంద్రుడు.

"ఏ విషయం బావగారూ?" అన్నాడు ఆయన ఆనందాంబుధిలో నుంచే! ఆయన అప్పుడే బంధుత్వం కల్పుకున్నాడు కూడా!

"ఎంత ఇదైనా స్నేహితుల దగ్గర లేకీగా వుండ కూడదుగా! తర్వాత మనలో మనం! కట్నంగా కొంత కన్పించకపోతే బంధువుల సంగతెలా వున్నా స్నేహితుల ముందు..."

అర్ధమైంది రమాదేవ్‌కు. అప్పటదాక కట్నం గురించి ఒక్కమాట కూడా అనలేదు గుణేంద్రుడు. సమయం చూచి బాణంవదిలాడు.

"దానిదేముంది బావగారూ! మీరెంత అంటే అంతే నాకు మాత్రం ఎవరున్నారు అంతా అపిల్లే!"

"అవుననుకొండి! అయినా..."

"మీరెంత అంటే అంత యివ్వటానికి నేను సంకోచించను. మిసంతోషమే మాకు కావల్సింది"

"మొన్న వాడిస్నేహితునికి రెండు లక్షలు యిచ్చారట కట్నంక్రింద! మావాడు వాడితో పందెం వేశాడు ఐదు "ల" కారాలు లేంది నేను చేసుకొను పెండ్లి అని..." అంటూ గుణేంద్రుడు రాజశేఖర్ వైపు చూచాడు. అతను నవ్వాడు అవునన్నట్లు. లోకసరళి!

వెంటనే 5 లక్షలకు చెక్కురాసి యిచ్చాడు. రమాదేవ్. సాధన గుణేంద్రుని వైపు చూచింది రాజశేఖర్ వైపు ఒక వాడిచూపు విసిరింది.

"నాకు తెల్సు బావగారూ మీసంగతి! ఏదో బంధు మిత్రులలో గొప్పకు తప్ప ఇందులో ఏముంది?" అంటూ భద్రంగా కోటు జేబులో దాన్ని దాచుకున్నాడు గుణేంద్రుడు.

"కానీయండి! కానీయండి!" అన్నాడు ఆయన పురోహితుని చూచి.

రాజశేఖర్ ఎందుకో ఇంకా తటపటా యిస్తున్నాడు. ఏదో అతని మనస్సులో వుంది.

"ఏంనాయనా! అలకపాన్పు యిక్కడే వేస్తున్నావేం? ముహూర్తం మించి పోతున్నది. ఆసంకోచమేమో తెల్పునాయనా!" అన్నాడు రమాదేవ్ అనునయంగా.

"నాకు రోల్సు రాయిస్ కారు..." అని ఆగాడు రాజశేఖర్ మిగత పని మీరే పూర్తిచేసు కోండి అని.

సాధన కళ్ళల్లో రక్తం వుబికింది. రమాదేవ్ చెక్కు రాసి యిచ్చాడు. శేఖర్ అందుకుంటున్నాడు. సాధన కళ్ళల్లో నుంచి నిప్పులు కురిసాయి! వెంటనే విసురుగా ఆచెక్కును మధ్యలోనే అందుకొని చించి పారేసింది. ముఖం చిటపట లాడుతుంది.

"సాధనా! ఏమిటిది?"

"దాదీ! మీరె చెప్పండి! కట్నాల వాసన చూడమంటూ పెండ్లి పీటల మీద ఐదు లక్షలకట్నం వడిసి తిసుకొన్న దాక గుణేంద్రుగారికి మిగత విషయాల మీద ధ్యాసేలేదు. ఆపైన ఈయనకు రోల్సు రాయిన్! ఈ ఆస్తంతా ఒకే దెబ్బతో తాగేయాలనా సంకల్పం? ఇంత ఆస్తి పరులైనా 1918 మాడల్ కారులో వచ్చారు పెండ్లికి. వీరికి రోల్సు రాయిస్ కావాల్సి వచ్చింది!"

"సాధన! ఏమిటమ్మా ఈ ఆగడం?" వూరుకోండి దాదీ!" అని సాధన, తండ్రి కొడుకులవైపు తిరిగి "అయ్యా! మీడబ్బుదాహం మేము తీర్చలేం! ఆస్తంతా మీకు దానంచేయుటానికి కాదు యిన్ని రోజులునుంచి మానాన్న గారు సంపాదించింది! డబ్బుకోసం మానపత్వం చంపుకొనిపశువుగా మారే వ్యక్తిని నేను పెండ్లి చేసుకోలేను దయచేయండి బయటికి" అని నమస్కరించింది సాధన.

ఉడికిపోయాడు గుణేంద్రుడు. అదిరి పోయాడు రాజశేఖర్. "సాధనా సాధనా!" అంటూనే వున్నాడు రమాదేవ్. పెండ్లి కొడుకువైపువారు కోపంగా లేచారు

"జేబులోని చెక్ ఇటుపడేసి మరీ కదలండి" అన్నది సాధన అపరచండిక లాగుంది ఆమె వాలకం. రమాదేవ్ తలపట్టుకొని కుషన్లో కూలపడ్డాడు.

ఉరుమురిమి పిడుగు పడ్డట్లుంది. చావునిశ్శబ్దత ఆవరించింది.

* * *

"సాధన!...సాధనా!" అన్నాడు చుబుకాన్ని పట్టుకొని తల పైకెత్తుతూ.

సాధన సిగ్గుతో కళ్ళు మూసుకుంది. కొంచెం అవతలకు జరిగి అటుతిరిగి.

"నీ వారోజు టెన్నీసు బాలుతో నా గుండెమీద వేసినప్పుడు యిలాగ పరిణమిస్తుందని నేననుకో లేదు. మీ అంతస్తుకు నా అంతస్తుకూ వున్నభేదం..."

"క్షమించండి! ధనంపట్లే నాకళ్ళు మూసుకొనిపోయి, ధనమే సర్వస్వం అనుకున్న నాకు అతని పశుప్రవృత్తితో తెల్సింది గుణమెంత ప్రధానమో! మీరు చూచారుగా! కట్నంకానుకలు లేకుండా, మా తండ్రి ఆస్తిమీద ఆశలేకుండా వున్నవాళ్ళు ఎవరైనాసరే నేను పెండ్లి చేసుకుంటానని అంటే ఎవరైనా ముందుకు వచ్చారా? మీరు తప్ప.

"బంతి తగిలినప్పుడు మీదగ్గరికొచ్చి క్షమించమని కోరుదామనుకున్నా, కాని మీరుపోవటంతో నాలోని అహంకారం దెబ్బతిని, మీలోని మంచినాకు తెలియలేదు. మీలోని మంచిగుణాలు జయంతి చెపుతువున్నా నిర్లక్ష్యంగా తెగడాను. కాని నా అంతః కరణలో ఎక్కడో మీ మీద మమత మసలుతున్నదని నాకు తెలేదు. అదృష్ట వంతురాల్ని. ఆపశువు నామెడలో వురిత్రాడు కట్టక ముందే బయటపడి మీలాంటి అభ్యుదయవాడిని, నిస్వార్థ పరులను, శాంతి స్వరూపులను పొందే భాగ్యం నాకు కల్గింది. ఇంకేం కావాలి నాకు?"

"అదృష్ట వంతుణ్ణి నేను సుమా!" అన్నట్లు చూచాడు సాధన కళ్ళల్లోకి శ్రీకాంత్. ఆమె అతని రెండు కళ్ళల్లో తన ప్రతిబింబాల్ని చూచుకొని పరవశత్వం పొందింది.

సాధన కాటుక కంటి కొనలనుంచి ఆనందాశ్రువులు రెండురాలాయి!

★

